జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ‖సంపుటి:1 ‖ సంచిక: 58 ‖ శనివారం ‖ 25-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-



25 జూలై 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:57 సూర్యాస్తమయం - సా. 6:48 తిథి ఏకాదశి ఉ. 11:34 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం జ్యేష్ఠ ఉ. 7:27o వరకు యోగం బ్రహ్మ రా. 8:59 వరకు కరణం విష్టి ఉ. 11:34 వరకు బవ రా. 12:46o వరకు వర్జ్యం ఉ. 10:54 నుండి మ. 12:42 వరకు దుర్ముహూర్తం ఉ. 7:40 నుండి ఉ. 8:31 వరకు రాహుకాలం ఉ. 9:09 నుండి ఉ. 10:46 వరకు యమగండం మ. 1:59 నుండి మ. 3:35 వరకు గుళికాకాలం తె. 5:57 నుండి ఉ. 7:33 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:21 నుండి తె. 5:09 వరకు అమృత ఘడియలు రా. 9:40 నుండి రా. 11:28 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున





# జనావాసాల్లోనే.. ఇందిరమ్మ ఇండ్లు

### ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు
### పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
### క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష

నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు.

హైదరాబాద్,జూలై24: పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే -2 వ పేజీలో...



# పిల్లలే మన భవిష్యత్ ఆస్తి

### పిల్లలు పుడితే భారం కాకుండా చేశాం
### ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు
### విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లది
### తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల భేటీలో సిఎం చంద్రబాబు

పిల్లలు ఆనందంగా చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రంపచోడవరంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. విద్యా వ్యవస్థకు ఉపాధ్యాయులే వెన్నెముక అని అన్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులను ప్రయోజకులుగా చేయడం టీచర్ల బాధ్యతన్నారు.

రంపచోడవరం,జూలై24 :పిల్లలం దరికీ పౌష్టికాహారం ఇస్తున్నామని తెలి పారు. పీ4 కార్యక్రమంలో పేదవారిని ఆదు కునేలా కృషి చేస్తున్నామని అన్నారు. భవిష్య త్తులో పిల్లలే ఆస్తి అని సీఎం తెలిపారు. పిల్లలు పుడితే భారం కాదని.. ఆదాయంగా మా ర్చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం డబ్బులు ఇస్తున్నామన్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ.10,120 కోట్లు జమ చేస్తున్నా మని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనే 5 లక్షల మందిక తరువాయి 2 వ పేజీలో..



## డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు

# కఠిన నిబంధనలు

### ఉన్నతాధికారులకు సిఎం రేవంత్ అదేశాలు

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు.

హైదరాబాద్,జులై 24 : విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఆయా సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమా న్యాన్నే బాధ్యులను చేయాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించా లని అధికారులను ఆదేశించారు. ఉద్యాసం స్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగిం చాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు. విద్యార్థు ల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం.. ఈ మూడు దశలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని అన్నారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ సీఎం రేవంత్ స్పష్టం చేశారు.




# సింగరేణి విస్తరణకు నిర్ణయం

### రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరణ
### సింగరేణి భవిష్యత్తుకు అండగా ప్రజా ప్రభుత్వం
### బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి
### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయని ఆయన అన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగితే, క్రమంగా థర్మల్ విద్యుత్ మరియు బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని అన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం,జూలై24 : ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని చెప్పారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్ కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిది. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే, ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని ఆ న్నారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని తరువాయి 2 వ పేజీలో..




## సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలి

### యువతను ఫాలో కావడం అవసరమే
### కేబినేట్ భేటీలో మంత్రులకు మోడీ సూచన



## గిరిజన ప్రాంత పాఠశాలలకు సొంత భవనాలు

### శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలకు మరమ్మత్తులు: నారా లోకేష్

రంపచోడవరం,జులై 24: వచ్చే ఏడాదిలోగా గిరిజన ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాల మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. విద్యార్థులకు తరువాయి 2 వ పేజీలో..




# యువతే దేశ భవిష్యత్తు: కేటీఆర్

### విద్యార్థుల ఉద్యమానికి బీఆర్ఎస్‌వీ సంఘీభావం
### ఇందిరాపార్క్‌లో నిరసనలో పాల్గొన్న కేటీఆర్
### యువశక్తిని తక్కువ అంచనా వేయొద్దని హెచ్చరిక

దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై విద్యార్థులకు మద్దతు ప్రకటించారు. తన పుట్టినరోజు వేడుకలను రద్దు చేసుకుని నల్లచొక్కా ధరించి నిరసనలో పాల్గొన్న ఆయన, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

- హైదరాబాద్, జూలై 24

# నేటి రాశి ఫలాలు

**మేషం :** ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే ఆశించిన విజయాలు సొంతం అవుతాయి. వృత్తి, ఉద్యోగ రంగాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటారు. మీ పట్ల గౌరవం పెరుగుతుంది. మీ ప్రతిష్ఠ, ప్రభావం మరింత వృద్ధి చెందుతాయి. గణనాయకాష్టకం పఠించడం శ్రేయస్కరం.

**వృషభం :** ఉద్యోగ, వ్యాపార రంగాల్లో అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఉత్సాహంతో ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. స్నేహితులు, బంధువులతో ఆనందంగా గడుపుతారు. ఒక శుభవార్త మనసుకు ఉత్సాహాన్ని కలిగిస్తుంది. శ్రీఆంజనేయ స్వామి ఆరాధన శుభప్రదం.

**మిథునం :** ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారు. అవసరమైన సమయంలో తగిన సహకారం లభిస్తుంది. బంధుమిత్రులతో అనుబంధం మరింత బలపడుతుంది. ప్రారంభించిన పనుల్లో సంతృప్తికరమైన ఫలితాలు పొందుతారు. ఇష్టదైవ ఆరాధన శుభప్రదం.

**కర్కాటకం :** కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ ధైర్యం, పట్టుదలతో వాటిని అధిగమిస్తారు. ప్రతికూల పరిస్థితులు క్రమేణా మీకు అనుకూలంగా మారుతాయి. బంధాలను మరింత బలోపేతం చేసుకునే అవకాశం లభిస్తుంది. మాటల్లో సంయమనం పాటించడం మేలు చేస్తుంది. శ్రీలక్ష్మీ స్తోత్రం పఠించడం మంగళప్రదం.

**సింహం :** మిశ్రమ పరిస్థితులు ఎదురైనప్పటికీ సమయోచితంగా వ్యవహరిస్తే మంచి ఫలితాలు పొందుతారు. పనిభారం పెరిగే అవకాశం ఉన్నందున విశ్రాంతికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. కుటుంబ సభ్యుల సూచనలు ఉపయోగపడతాయి. అనవసర విభేదాలకు దూరంగా ఉండండి. దుర్గాదేవి ధ్యానం శాంతిని ప్రసాదిస్తుంది.

**కన్య :** పెద్దల ఆశీర్వాదం, సహకారం లభిస్తుంది. కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ పట్టుదలతో ముందుకు సాగి విజయం సాధిస్తారు. ఖర్చుల విషయంలో మితవ్యయం పాటించడం మంచిది. చిన్నచిన్న విషయాలను మనసుకు తీసుకోకుండా ప్రశాంతంగా ఉండాలి. హనుమాన్ చాలీసా పఠించడం శ్రేయస్కరం.

**తుల :** అదృష్టం మీకు అనేక విధాలుగా కలిసి వస్తుంది. కృషికి తగిన గుర్తింపు, ప్రశంసలు లభిస్తాయి. ధైర్యంగా తీసుకునే నిర్ణయాలు విజయానికి దారితీస్తాయి. మీ ప్రతిభకు అందరి నుంచి ప్రశంసలు లభిస్తాయి. శివారాధన మంగళప్రదం.

**వృశ్చికం :** పట్టుదలతో ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. శుభకార్యక్రమాల్లో పాల్గొని ఆనందాన్ని పొందుతారు. కుటుంబంలో చిన్నచిన్న భేదాభిప్రాయాలు వచ్చినప్పటికీ సహనంతో వాటిని పరిష్కరించగలుగుతారు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించడం శుభప్రదం.

**ధనుస్సు :** శుభఫలితాలు అందించే సమయం. మీ తెలివితేటలు, చాతుర్యం అందరినీ ఆకట్టుకుంటాయి. కుటుంబాభివృద్ధికి సంబంధించిన ఆనందకరమైన వార్త వింటారు. ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో కార్యక్రమాలను పూర్తి చేస్తారు. ఇష్టదైవ ఆరాధన శ్రేయస్సును ప్రసాదిస్తుంది.

**మకరం :** అవసరమైన సమయంలో సహాయం అందుతుంది. బంధుమిత్రుల సూచనలను గౌరవిస్తే ప్రయోజనం పొందుతారు. ప్రణాళికాబద్ధంగా ఖర్చులు చేస్తే ఆర్థికంగా స్థిరత్వం ఉంటుంది. పనుల మధ్య విశ్రాంతికి సమయం కేటాయించడం మంచిది. శివారాధన శాంతిని ప్రసాదిస్తుంది.

**కుంభం :** పట్టుదలతో ప్రారంభించిన పనులు పూర్తవుతాయి. మీ బుద్ధిబలం, సమయస్ఫూర్తి మంచి ఫలితాలను అందిస్తాయి. చిన్నచిన్న సమస్యలు ఎదురైనప్పటికీ వాటిని సులభంగా పరిష్కరించగలుగుతారు. కొత్త అవకాశాలు మీకు అనుకూలంగా మారుతాయి. శని శ్లోకం పఠించడం మంగళప్రదం.

**మీనం :** అనుకూల పరిస్థితులు ఏర్పడి మనఃశ్శాంతి, సంతోషం లభిస్తాయి. వృత్తి, వ్యాపార రంగాల్లో లాభదాయకమైన అవకాశాలు కనిపిస్తాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా సమయం గడుపుతారు. ప్రారంభించిన పనులు సానుకూలంగా పూర్తవుతాయి. గణపతి ఆరాధన శుభఫలితాలను అందిస్తుంది.



# పిల్లలే మన భవిష్యత్ ఆస్తి

మొదటి పేజీ తరువాయి

రూ.664 కోట్లు జమ చేస్తున్నామన్నారు. గిరిజనులకు ఐఐటీలో ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఆగస్టు నుంచి సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికీ సోలార్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించి జీవన ప్రమాణాలు పెంచుతామని వెల్లడించారు. పది లక్షల కోట్లు అప్పులు ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విద్య పైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిపారు. పీటీఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసంధానం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి. పిల్లలు పుడితే భారం కాదు.. ఆదాయంగా మార్చేశాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.



గిరిజన ప్రాంతాల్లోనే 5లక్షల మందికి రూ.664 కోట్లు వారి ఖాతాల్లో వేశామని చెప్పారు. ఆర్థిక

అసమానతలు తగ్గించాలని ధ్యేయంగా పెట్టుకున్నాం. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే అభివృద్ధిని నడిపిస్తున్నాం. పీ4 కార్యక్రమంతో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నాం. అప్పులు కాదు.. ఆదాయాన్ని పెంచాలి. పిల్లలు సమాజానికి ఉపయోగపడాలి. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది. విద్యా వ్యవస్థకు వెన్నెముక ఉపాధ్యాయులు. సమాజంలో టీచర్లకు మంచి గుర్తింపు ఉంది. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. పిల్లలు ఆనందంగా ఉంటే బాగా చదువుతారు. అందుకే వారికి పౌష్టికాహారం అందిస్తున్నాం. ఆగస్టు నుంచి సంజీవని ప్రాజెక్టు రాబోతోందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ దిశగా ఇప్పటికే బలమైన అడుగులు వేస్తున్నామని చెప్పారు. తల్లికి వందనం ఆర్థికసాయం మాత్రమే కాదని.. తల్లిని, గురువును గౌరవించడమే దీని అసలు లక్ష్యమని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 43 వేల పాఠశాలల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చర్చించేందుకు ఏర్పాటు చేసిన వేదిక ఈ మెగా పీటీఎం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తానని సీఎం చంద్రబాబుకు హామీ ఇచ్చానని.. అది తన ఒక్కడి వల్లే సాధ్యం కాదన్నారు. దీనికోసం తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అనుసంధానం కావాలని చెప్పారు.

# సింగరేణి విస్తరణకు నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీనితో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణా వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని అన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠినంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు. బొగ్గు శుద్ధీకరణకు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో ÷-లబెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి.. వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేక పోయిందని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ఎ÷-లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదని అన్నారు. వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల-2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని అన్నారు. సింగరేణి అనేది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని, మైన్ స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో ఓపెన్ చర్చలు ప్రారంభించాలని అన్నారు. సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం విపరీతంగా మారబోతోందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ ఆధారిత బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇవి పెరిగితే థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని అధికారులకు సూచనలు చేశారు. సెమీకండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు. ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే 10 ఏళ్ల రోడ్‌మాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి సూచనలు చేశారు. కార్పొరేట్ సంస్థల మాదిరిగా టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అధికారులకు దిశా నిర్దేశంచేశారు.

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

# సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలి

## కేబినేట్‌లో మంత్రులకు మోడీ సూచన

న్యూఢిల్లీ,జులై 24(ఆర్ఎన్ఎ): యువతకు మరింతగా చేరువయ్యేందుకు కేంద్ర మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం కేబినెట్ సమావేశం సందర్భంగా మంత్రులకు ఈ మేరకు సూచించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత మంది యాక్టివ్‌గా ఉంటున్నారని ప్రధాని మోదీ మంత్రులను ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ సమయం సోషల్ మీడియాలోనే ఉంటున్నట్టు చెప్పారు. కాబట్టి ప్రభుత్వం సోషల్ మీడియా వేదికల్లో యువతకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేసినంత మాత్రాన సరిపోదని ప్రధాని మంత్రులకు చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో నేరుగా యువతతో టచ్‌లో ఉండాలని ప్రధాని సూచించారు. యువతకు మరింత దగ్గర చేసే రీల్స్ వంటి క్రియేటివ్ కంటెంట్‌ను పోస్టు చేస్తూ ఉండాలని కూడా ప్రధాని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

# గిరిజన ప్రాంత పాఠశాలలకు భవనాలు

మొదటి పేజీ తరువాయి

మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఇక, ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్న మంత్రి లోకేష్, ఇప్పటికే సుమారు 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని వెల్లడించారు. ఇది ప్రభుత్వ విద్యా విధానాలపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఈ విజయానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషే ప్రధాన కారణమని లోకేష్ కొనియాడారు. విద్యార్థులు సాధించే మంచి ఫలితాలే ప్రభుత్వానికి నిజమైన ప్రచారమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# యువతే దేశ భవిష్యత్తు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి




విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ యువతే దేశ భవిష్యత్తు అని స్పష్టం చేశారు. నేటి తరం ఆలోచనలు, అభిప్రాయాలు, పోరాట స్ఫూర్తిని ఎవరూ తక్కువ అంచనా వేయకూడదన్నారు. జెన్‌జెడ్ తరం సామాజిక మాధ్యమాల ద్వారా తమ స్వరాన్ని దేశవ్యాప్తంగా వినిపిస్తోందని, ప్రజాస్వామ్యంలో యువత అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యం ఉండాలని పేర్కొన్నారు. నేపాల్‌లో యువత ఉద్యమాల ప్రభావంతో ప్రభుత్వంలో మార్పులు చోటుచేసుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, యువశక్తిని నిర్లక్ష్యం చేయడం ఏ ప్రభుత్వానికైనా మంచిది కాదని వ్యాఖ్యానించారు. సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన దీక్షకు ప్రధాన స్రవంతి మీడియా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని కేటీఆర్ ఆరోపించారు. అయినప్పటికీ విద్యార్థులు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని తమ సమస్యలను దేశ ప్రజలకు తెలియజేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు ప్రతి పౌరుడి హక్కు అని, వాటిని అణచివేయడం కంటే ప్రజల అభిప్రాయాలను వినడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు వస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు తమను అడ్డుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ విభేదాలను పక్కనబెట్టి విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో యువత పాత్ర ఎంతో కీలకమని, వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఆ ప్రశ్నలకు అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే వారు ముందుగా యువత ఆవేదనను అర్థం చేసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిరసన తెలుపుతున్న విద్యార్థుల స్వరాన్ని గౌరవించి వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అవసరమైతే మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కూడా విద్యార్థుల ఉద్యమానికి అండగా నిలుస్తారని కేటీఆర్ తెలిపారు. కరోనా సమయంలోనే పిల్లలే దేశ ముఖచిత్రాన్ని మార్చగల శక్తి అని కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. దేశ అభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని, వారిలో ఉన్న శక్తి, సామర్థ్యాలను సరైన దిశలో వినియోగిస్తే దేశం మరింత పురోగతి సాధిస్తుందని అన్నారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే విధానాలను ప్రభుత్వాలు అమలు చేయాలని కేటీఆర్ కోరారు.

శ్వేత

# సంపాదకీయం

**శనివారం 25-7-2026**

# బొద్దింకలను తేలికగా తీసుకోరాదు!

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి.

దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు.

ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది.పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువే లేదు. ప్రజాస్వా మ్యం,జవాబుదారీతనం కోసమే యువత వీధులకు ఎక్కింది. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యా ర్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగు బాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడి యానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పం దించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటా యి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవర మైన పనులనే చేయాలి. అప్పడే దేశం బాగుపడుతుంది. మాటలతో ఎంతోకాలం మభ్య పెట్టలేమని గుర్తిస్తే, బొద్దింకల బాధా ఉండదు.



# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బొండా ఉమా

**ఘనంగా మెగా పేరెంట్-టీచర్ మీటింగ్**

విజయవాడ, జూలై 24: సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్ సత్యనారాయణపురం ాఖూ ప్రభుత్వ పాఠశాలలో 'మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ (ావీ 4.0)' కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, సెంట్రల్ శాసనసభ్యులు శ్రీ బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై, విద్యాబోధనలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 'దీక్ష (ఙ×ఖూనాా) యాప్' వినియోగం, విద్యార్థుల చదువులో సాంకేతికత ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ావీ 4.0 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతోందని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు ఉచితంగా ఇస్తున్నామని, 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. 'తల్లికి వందనం' ద్వారా ప్రతీ విద్యార్థికీ ఆర్థిక సాయం అందిస్తున్నామని చెబుతూ, "చదువుపై పెట్టే ఖర్చు వ్యయం కాదు... రాష్ట్ర భవిష్యత్తుపై చేసే పెట్టుబడి" అని వ్యాఖ్యానించారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకే వేదికపైకి వచ్చి సూచనలు, సమస్యలు పంచుకోవడం ద్వారానే బడుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ాఖూ పాఠశాల హెచ్‌ఎం ఉమర్ అలీ, 33వ డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు నాళం కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పొట్లూరి కృష్ణ ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం

**కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి**

న్యూఢిల్లీ,జూలై24(ఆర్‌ఎన్‌ఎ): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏమీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోబోమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చర్చల కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లబోమని.. జంతర్‌మంతర్ వద్దే చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కఠిన చర్య అని పేర్కొన్నారు.



# ప్రతి అర్జీకి జవాబుదారీతనం

**ప్రజా దర్బార్ లో వినతుల స్వీకరణ: బొండా ఉమా**

విజయవాడ, జూలై 24: సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 'ప్రజా దర్బార్' (ా+ాా) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే నేరుగా వినతులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ... ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌పై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ప్రతి వినతిపత్రంపైనా అత్యంత జవాబుదారీతనంతో స్పందిస్తున్నామని తెలిపారు. తొలి రోజుల్లో వందలాది ఫిర్యాదులు రాగా, సమస్యలు వేగంగా పరిష్కారం అవుతుండటంతో ఇప్పుడు వినతుల సంఖ్య గణనీయంగా తగ్గడమే ఈ వేదిక విజయానికి నిదర్శనమని చెప్పారు. నియోజకవర్గ నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడిన ఆయన, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ భవిష్యత్తులోనూ ఇదే సేవా స్ఫూర్తితో నిరంతరం అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.

# లారీ ఓనర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి మండిపల్లి

విశాఖపట్నం, జూలై 24: శ్రీకాకుళం ఇసుక రీచ్‌లలో సాగుతున్న ఓవర్‌లోడింగ్, ఫేక్ బిల్లుల దందా వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. విశాఖలోని హోటల్ దాస్పల్లాలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. పరిమితికి మించి ఇసుక లోడింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరగడమే కాకుండా, ప్రమాదాలు జరిగినప్పుడు ఓవర్‌లోడింగ్ కారణంగా ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం చెల్లించక డ్రైవర్లు, క్లీనర్లు, వాహన యజమానులు తీవ్రంగా అన్యాయానికి



గురవుతున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు వీ.ఎ. రమణ, కార్యదర్శి దీ. సురేష్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లోడింగ్ జరిగేలా చూడాలని, దీనిపై లారీ సిబ్బందికి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లారీ యజమానుల ఆవేదనపై సానుకూలంగా స్పందించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి.. ఈ సమస్యను తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, శ్రీకాకుళం ఇసుక రీచ్‌లలో నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# రామజన్మభూమి తీర్థ ట్రస్ట్‌పై సీబీఐ విచారణ జరిపించాలి



## వి. హనుమంతరావు డిమాండ్.. ఢిల్లీలో మౌనదీక్ష

**న్యూఢిల్లీ, జూలై 24 (మన దీపం):**

అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించిన ఆర్థిక అవకతవకల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మంత్రి, మాజీ ఎంపీ, మాజీ పీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రాంగణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన మౌనదీక్షలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ, శ్రీరాముడి పేరుతో ప్రజలు సమర్పించిన విరాళాల వినియోగంపై వచ్చిన ఆరోపణలను పారదర్శకంగా విచారించాలని కోరారు. సత్యం వెలుగులోకి రావాలంటే సీబీఐ దర్యాప్తు అవసరమని అన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి మాట్లాడుతూ, రామమందిరానికి సంబంధించిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ ఎం.పీ. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, తాను శ్రీరాముడిపై ఉన్న భక్తితో రూ.1 కోటి విరాళంగా అందించానని, ప్రస్తుతం వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆ నిధుల వినియోగంపై పూర్తి లెక్కలు వెల్లడించాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు వి. నరేందర్ రెడ్డి, మందా అనిల్ కుమార్ యాదవ్, మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఆల్ ఇండియా యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, యువజన కాంగ్రెస్ కార్యదర్శి పొలాగని వెంకట్ గౌడ్, గునుగుంట్ల శ్రీనివాస్, సింగం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీపై నిరసన.. సూర్యాపేటలో ఉన్నత విద్యాసంస్థల బంద్ విజయవంతం

**సూర్యాపేట, జూలై 24 (మన దీపం):**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు (పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇంటర్ నుంచి పీజీ వరకు ఉన్నత విద్యాసంస్థల బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలుమార్లు నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని, దేశవ్యాప్తంగా 22.75 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాసిన నేపథ్యంలో ఈ ఘటన అత్యంత తీవ్రమైందని పేర్కొన్నారు. ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీకి నిరసనగా ఢిల్లీలోని



జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం తగదని, కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్బంధ వైఖరిని విడనాడాలని కోరారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, పరీక్ష రాసిన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే దేశవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బోర లెనిన్, కేశపోయిన వంశీ, ప్రవీణ్, అరుణ్, మనీ, రహీం, పులుసు దిలీప్, సాయితేజ, వెంకటరెడ్డి, నాని తదితరులు పాల్గొన్నారు.

# దళిత నియోజకవర్గాలపై మీ పెత్తనమేంటి?

## కోమటిరెడ్డి సోదరులపై ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర వ్యాఖ్యలు

**తుంగతుర్తి రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దని హెచ్చరిక**

**హక్కులకు భంగం కలిగిస్తే అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని వెల్లడి**

**తిరుమలగిరి, జూలై 24 (మన దీపం):**

తుంగతుర్తి నియోజకవర్గ రాజకీయాల్లో జోక్యం చేసుకునే నైతిక హక్కు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి లేదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఘాటుగా వ్యాఖ్యానించారు. దళిత నియోజకవర్గాలపై పెత్తనం చెలాయించే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన హెచ్చరించారు. తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై సామేల్ తీవ్ర విమర్శలు చేశారు. తుంగతుర్తి నియోజకవర్గం గురించి గాంధీభవన్‌లో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని అన్నారు. మునుగోడు ఎమ్మెల్యేకు తుంగతుర్తి నియోజకవర్గంతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ముందుగా మునుగోడు నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులకు పదవులు ఇప్పించుకోలేని వారు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని సామేల్ ఆరోపించారు. నియోజకవర్గంలోని రహదారుల దుస్థితిపై పలుమార్లు విన్నవించినప్పటికీ మంత్రి స్పందించలేదన్నారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తాను ఎవరి దయాదాక్షిణ్యాలతో రాజకీయాల్లోకి రాలేదని, రాజ్యాంగం కల్పించిన అవకాశంతోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని చెప్పారు. తుంగతుర్తి ప్రజలకు, ఓటర్లకు మాత్రమే తాను జవాబుదారీగా ఉంటానన్నారు. నకిరేకల్‌లో వేముల వీరేశానికి 67 వేల మెజార్టీ, తుంగతుర్తిలో తనకు సుమారు 50 వేల మెజార్టీ ఇచ్చిన ప్రజల తీర్పును గౌరవించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి బడుగు, బలహీన వర్గాలే వెన్నెముకగా నిలుస్తున్నాయని సామేల్ చెప్పారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొందరు పార్టీని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నియమించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులే కొనసాగుతారని స్పష్టం చేశారు. వారి నియామకాల విషయంలో ఎవరూ అనవసరంగా జోక్యం చేసుకోవద్దన్నారు. 0రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవుల్లో ఒకటి ఎస్టీ వర్గానికి, మరొకటి యాదవ సామాజికవర్గానికి కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.


తన రాజకీయ హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలు కొనసాగితే పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడంతోపాటు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని ఉధృతం చేస్తానని హెచ్చరించారు. అభివృద్ధి పనులు చేపట్టాం తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత రూ.32 కోట్లతో బిక్కేరు వాగుపై ఆరు చెక్‌డ్యామ్‌లను పూర్తి చేశామని సామేల్ తెలిపారు. వీటివల్ల సుమారు 12 వేల ఎకరాల సాగుభూమికి ప్రయోజనం కలిగిందన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.170 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. ముప్పై గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలు, సుమారు రూ.200 కోట్లతో సమీకృత విద్యాసంస్థ, తిరుమలగిరిలో జూనియర్ కళాశాల, రూ.16 కోట్లతో తుంగతుర్తి ప్రధాన రహదారి మంజూరు చేయించినట్లు తెలిపారు. తిమ్మాపురం నుంచి వెంకేపల్లి వరకు రూ.18 కోట్లతో డబుల్ రోడ్డు పనులు చేపట్టామని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో బుదానిగాని కాలువను మంజూరు చేయించినట్లు వివరించారు. ఈ సమావేశంలో తిరుమలగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి జనార్ధన్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో ఐదు రోజులుగా వీధి దీపాలు బంద్

**చీకటితో ప్రజలు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు**

**సూర్యాపేట, జూలై 24 (మన దీపం):**

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో గత ఐదు రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిర్యాలగూడ--హుజూర్‌నగర్, కోదాడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పూర్తిగా చీకటి అలుముకోవడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాద భయంతో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులు వీధి దీపాలు వెలిగించి, ఆ తర్వాత మళ్లీ రోజులు తరబడి నిలిపివేయడం వల్ల సమస్య మరింత తీవ్రమైందని వారు పేర్కొంటున్నారు. ప్రధాన కూడలి కావడంతో రాత్రి సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు ఎందుకు వెలగడం లేదనే విషయంపై మున్సిపల్ అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, సాంకేతిక సమస్య ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టి దీపాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధాన రహదారిపై వెలుతురు లేకపోవడం



ప్రజల భద్రతకు ముప్పుగా మారిందని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం

**మొరిశెట్టి నివేదిత, హన్మంత రెడ్డి**

**సూర్యాపేట, జూలై 24 (మన దీపం):**

డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటిస్తూ ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక 26వ వార్డులో 'డ్రై డే', 'సఫాయి అప్నావో -- బీమారీ భగావో' కార్యక్రమాలతో పాటు డెంగ్యూ, మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, కమిషనర్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వ్యాధి నివారణ చర్యలను వివరించారు. ఇళ్లలోని కూలర్లు, కుండీలు, పాత టైర్లు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవాంఇఇఇఇలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి దోమల నివారణ చర్యలపై కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల వ్యాప్తిని అరికట్టడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ పొలగాని మాధవి కృష్ణ, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక నివాసులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో "పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

# పక్కా ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, జూలై 24 (మన దీపం):**

జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. పారదర్శకంగా, తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని కలెక్టర్ తెలిపారు. మొత్తం 10,08,252 మంది ఓటర్లలో 9,34,581 మంది వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, ఇది 92.69 శాతం పురోగతిగా పేర్కొన్నారు. మిగిలిన 73,671 మంది ఓటర్ల వివరాలను కూడా త్వరలోనే డిజిటలైజేషన్ పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలోని 1,205 పోలింగ్ కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తున్నారని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాల సవరణ, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్న వారి గుర్తింపు వంటి పనులను క్షేత్రస్థాయిలో చేపడుతున్నట్లు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఓటరు కార్డుల్లో పొరపాట్లు, డూప్లికేట్ నమోదులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, సాంకేతికత వినియోగంతో ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

**జిల్లాలో డిజిటలైజేషన్ పురోగతి**

మొత్తం ఓటర్లు: 10,08,252

డిజిటలైజేషన్ పూర్తయిన వారు: 9,34,581

మిగిలిన వారు: 73,671

డిజిటలైజేషన్ శాతం: 92.69%

పోలింగ్ కేంద్రాలు/బీఎల్వోలు: 1,205



# బాలభవన్ విద్యార్థినులకు హైదరాబాద్ విహారయాత్ర

**బేటీ బచావో--బేటీ పడావో నిధులతో నూతన వస్త్రాల పంపిణీ చేసిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, జూలై 24 (మన దీపం):**

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటీ బచావో--బేటీ పడావో' పథకం నిధులతో బాలభవన్ విద్యార్థినుల కోసం హైదరాబాద్‌కు ప్రత్యేక విహారయాత్రను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తన ఛాంబర్‌లో విద్యార్థినులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసి విహారయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసం, మానసిక ఉల్లాసం, విజ్ఞాన విస్తరణకు ఇటువంటి విద్యా విహారయాత్రలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా విద్యార్థులు చారిత్రక, సాంస్కృతిక, శాస్త్రీయ ప్రాధాన్యమున్న ప్రాంతాలను సందర్శించి కొత్త విషయాలను తెలుసుకోవాలని ఆకాంక్షించారు. ఆడపిల్లల విద్య, భద్రత, సాధికారతే 'బేటీ బచావో--బేటీ పడావో' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఈ పథకం ద్వారా బాలికల అభివృద్ధికి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె. నర్సింహారావు, ఏసీడీపీవో కిరణ్మయి, డీసీపీవో రవికుమార్, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, బాలభవన్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



## పాఠశాల అల్పాహార పథకానికి సీఎస్ఆర్ నిధులు

**హైదరాబాద్, జూలై 24 (మన దీపం):**

రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అల్పాహార పథకానికి దివీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా సంస్థలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ.22.18 కోట్ల విరాళాన్ని అందించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో జరిగిన కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ఈ నిధులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. దివీస్ లేబొరేటరీస్ సంస్థ రూ.12.18 కోట్ల చెక్కును, అరబిందో ఫార్మా సంస్థ రూ.10 కోట్ల చెక్కును హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యతలో భాగంగా ముందుకు వచ్చిన ఇరు సంస్థలను ముఖ్యమంత్రి అభినందించారు. హరే కృష్ణ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కేంద్రీకృత వంటశాలల పరిసర ప్రాంతాల రైతులకు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. వంటశాలలకు అవసరమైన కూరగాయలు, బియ్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసే విధానాన్ని ప్రోత్సహించాలని భావిస్తున్నట్లు చెప్పారు.




## ప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

### సందీప్ చిత్రపటానికి నివాళులర్పించిన కొమటిరెడ్డి

**యాదాద్రి భువనగిరి, జూలై 24 (మన దీపం):**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎలుగు యాదయ్య, పార్వతమ్మ దంపతుల కుమారుడు సందీప్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందడంతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సందీప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సందీప్ అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి విషాదం ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటూ వారికి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని తెలిపారు.



## వికారాబాద్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా ఇన్‌స్పెక్టర్

**వికారాబాద్, జూలై 24 (మన దీపం):**

సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై వికారాబాద్ జిల్లాకు వచ్చిన మహిళా ఇన్‌స్పెక్టర్ బి. ప్రమీల శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహా మెహ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహిళా ఇన్‌స్పెక్టర్ ప్రమీల జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌ను కలిసి తనను పరిచయం చేసుకున్నారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కను బహుకరించడం అభినందనీయమని ఎస్పీ స్నేహా మెహ్రా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర సేవలు అందించడంలో ప్రతి పోలీసు అధికారి సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా విధులు నిర్వహించాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మహిళల భద్రత, ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పోలీసింగ్ అందించేందుకు అన్ని స్థాయిల్లో చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ మర్యాదపూర్వక భేటీలో జిల్లా పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు. కొత్త బాధ్యతల్లో మహిళా ఇన్‌స్పెక్టర్ బి. ప్రమీలకు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహా మెహ్రా శుభాకాంక్షలు తెలియజేసి, విధుల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగును ఉద్యమంలా చేపట్టాలి

**ఆగస్టు 30లోగా ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించాలి**

**జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు**



**సూర్యాపేట, జూలై 24 (మన దీపం):**

రాష్ట్రంలో నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ఉద్యమంలా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అదే సమయంలో ప్రభుత్వ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలు అందేలా ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సెర్ప్ సీఈవో దివ్యతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పంటల వైవిధ్యీకరణ అత్యంత ప్రాధాన్య అంశమని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 52 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 14 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు పూర్తైందన్నారు. మొత్తం 1.39 కోట్ల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా సగం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తైందని, మిగిలిన భూముల్లో నీటి అవసరం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. జూలై 27 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహించే ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం చేయాలని, కంది, పెసర, మినుములు, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలు, కూరగాయల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బోరు నీటిపై ఆధారపడిన వరి సాగును తగ్గించాలని పేర్కొన్నారు. పాఠశాల యూనిఫాంల సరఫరా ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమమని పేర్కొన్న ఆయన, ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందేలా పకడ్బందీ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. వస్త్రాల సరఫరా, కటింగ్, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టు పనులు, నాణ్యత పర్యవేక్షణను జిల్లా, మండల స్థాయిలో నిరంతరం పరిశీలించాలని సూచించారు. పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు యూనిఫాంల పంపిణీ గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సుమారు 40 శాతం వర్షపాతం లోటు నమోదైందని, జలాశయాలు, భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఈ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో కంటింజెన్సీ ప్రణాళికలు అమలు చేసి వాతావరణ సూచనలను రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ యూనిఫాం వస్త్రాలను మండల కేంద్రాలకు సరఫరా చేసి, శిక్షణ పొందిన మాస్టర్ టైలర్లతో కటింగ్ పూర్తి చేసిన అనంతరం మహిళా టైలర్ల ద్వారా కుట్టు పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి మండలంలో మహిళా టైలర్లతో ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి పనుల పురోగతిని రోజువారీగా సమీక్షించాలని సూచించారు. యూనిఫాంల నాణ్యతపై ముఖ్యమంత్రి స్వయంగా ఫీడ్‌బ్యాక్ సేకరిస్తారని, నాణ్యతలో లోపాలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. యూనిఫాంల కుట్టు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించి, రైతు వేదికలు, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సీపీవో కిషన్, డీపీఓ యాదగిరి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీఈఓ అశోక్, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానందరాణి, హార్టికల్చర్ అధికారి నాగయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# సూర్యాపేటలో వెల్లివిరిసిన రైల్వే ఆకాంక్ష

**వేలాది మంది భాగస్వామ్యంతో రైల్వే సాధన సమితి సంతకాల సేకరణ విజయవంతం**

**అన్ని రాజకీయ, సామాజిక వర్గాల సంఘీభావం ఉద్యమానికి కొత్త ఊపు**


**సూర్యాపేట, జూలై 24 (మన దీపం):**

సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించాలనే ప్రజల చిరకాల ఆకాంక్ష శుక్రవారం వాణిజ్య భవన్ చౌరస్తాలో స్పష్టంగా ప్రతిధ్వనించింది. రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ సంతకాల సేకరణ కార్యక్రమానికి వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ సంతకాల ద్వారా ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ కార్యక్రమం సూర్యాపేట రైల్వే ఉద్యమ చరిత్రలో మరో కీలక ఘట్టంగా నిలిచింది. ఉదయం డాక్టర్ వి రామ్మూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, సూర్యాపేటకు సాధారణ రైలు మాత్రమే కాకుండా భవిష్యత్తులో బుల్లెట్ రైలు మార్గం కూడా అవసరమేనని అన్నారు. రైల్వే సాధన కోసం ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగం కొనసాగుతుండగానే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు “సూర్యాపేటకు రైల్వే లైన్ కావాలి”, “వీ వాంట్ జస్టిస్” అంటూ నినాదాలతో శిబిరానికి చేరుకోవడంతో అక్కడ ఉద్యమ స్ఫూర్తి ఉప్పొంగింది. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వై. వెంకటేశ్వర్లు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణమ్మ, మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, ఆకుల లవకుశ తదితరులు మాట్లాడుతూ సూర్యాపేట రైల్వే లైన్ అత్యవసరమని, దీనిని సాధించేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు చింతలపాటి చిన్న శ్రీరాములు మాట్లాడుతూ సామాజిక, రాజకీయ సంస్థలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కోరగా, సీపీఐ నాయకుడు చామల అశోక్‌కుమార్ కూడా ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. భయ్యా మల్లికార్జున్ బొమ్మగాని శ్రీనివాస్‌లు ప్రసంగించారు కార్యక్రమం ముగింపులో రైల్వే సాధన సమితి కో-కన్వీనర్ రాచూరి ప్రతాప్ అందరికీకృతజ్ఞతలు తెలిపారు. సాయంత్రం నిర్వహించిన సభలో రాష్ట్ర టూరిజం చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ, ఉత్తర భారతదేశంతో పోలిస్తే దక్షిణ భారతదేశంలో రైల్వే విస్తరణ తక్కువగా జరిగిందని, ఆ లోటును భర్తీ చేయడంలో సూర్యాపేట రైల్వే లైన్ కీలకమని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో తాను కూడా ముందుండి నాయకత్వం వహిస్తానని హామీ ఇచ్చారు. సాయంత్రం సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు భారీ మోటార్ ర్యాలీగా శిబిరానికి చేరుకుని సంతకాలు చేయడం విశేషంగా నిలిచింది. బార్ అసోసియేషన్ కార్యదర్శి తలమల్ల హసేన్, ఎస్. సోమేశ్వర్, గ్రంధి వెంకటేశ్వర్లు, కాకి రాంరెడ్డి, గుంటూరు మధు తదితరులు మాట్లాడుతూ రైల్వే సాధన ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధికి రైల్వే లైన్ ఎంతో అవసరమని పేర్కొంటూ వైద్యుల తరఫున పూర్తి మద్దతు ప్రకటించారు. కార్యక్రమం కొనసాగుతున్న సమయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ర్యాలీగా శిబిరానికి చేరుకుని “సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించాలి” అంటూ నినాదాలు చేశారు. ఆ పార్టీ నాయకులు కుంభం నాగరాజు, మీర్ అక్బర్ తదితరులు ప్రసంగిస్తూ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. సూర్యాపేట వ్యాపారుల పక్షాన బండారు రాజా రైల్వే సాధన సమితికి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. సిపిఐ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జర్నలిస్టు రాంబాబు చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. ఆయన పాలకులను నమ్ముకోవడం కన్నా ప్రజలను నమ్ముకోవాలని ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే సాధన సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ కే రంగారెడ్డి, గౌరవ సలహాదారులు లింగంపల్లి భద్రయ్య, బత్తుల వెంకన్న, యాతాకుల రాజన్న, మహంకాళి సోమయ్య,దంతాల కార్తీక్, పిడిమర్తి ఉమేష్, కె. మంజుల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ బ్యూరో ఏర్పాటుకు సీఎం ఆదేశం

**రోడ్డు భద్రతపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**

**హైదరాబాద్, జూలై 24 (మన దీపం):**



రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి, శాస్త్రీయ విధానాలతో పనిచేసే సంస్థాగత నిర్మాణంతో ఈ బ్యూరోను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రతి రెండు లేదా మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ట్రాఫిక్ వ్యవస్థలో కేవలం నిబంధనల అమలుకే పరిమితం కాకుండా క్రమబద్ధీకరణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. వాతావరణ పరిస్థితులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కొత్తగా రహదారులు, మౌలిక సదుపాయాలు నిర్మించే ముందు ట్రాఫిక్ అధ్యయనం తప్పనిసరిగా నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అక్కడ ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరంలో స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్ర అధ్యయనం చేసి అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సాధ్యమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లు నిర్మించి సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా వ్యవస్థను అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ నిర్వహణలో దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, కె. రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



## కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

**హైదరాబాద్, జూలై 24 (మన దీపం):**

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, శోభ దంపతులు ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఆయనను ఆశీర్వదించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో మొక్కను నాటారు. మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు సంఘీభావం తెలుపుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో కేటీఆర్ సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కుమార్తె రియాన్షి, ఇతర కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు స్వీకరించి పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా, వారిపై జరుగుతున్న చర్యలను నిరసిస్తూ ఈ ఏడాది తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉండాలని కేటీఆర్ నిర్ణయించుకున్నారు.




## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### సెరిలింగంపల్లి వార్డులో కమిషనర్ విస్తృత పర్యటన

**హైదరాబాద్, జూలై 24 (మన దీపం):**

ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన "రోజుకు ఒక వార్డు" కార్యక్రమంలో భాగంగా కమిషనర్ శుక్రవారం సెరిలింగంపల్లి జోన్‌లోని సెరిలింగంపల్లి వార్డును సందర్శించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వార్డులోని డోయెన్స్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ స్థానికంగా ఉన్న పౌర సమస్యలపై నేరుగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యటన సందర్భంగా డ్రైనేజీ వ్యవస్థ, నాలాల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి పారుదల సమస్యలు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. నాలాల శుభ్రత, చెరువుల పరిరక్షణ పనులను వేగవంతం చేసి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



## విద్యలో జిల్లాను ముందుకు తీసుకెళ్లాలి

### గద్వాలలో శిక్షణ శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్

**గద్వాల, జూలై 24 (మన దీపం):**

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తేనే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, జిల్లాను విద్యారంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న సమీకృత ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులు వివిధ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన సాగిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహించాలని, ప్రతి తరగతిలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండి ఒకరు బోధిస్తే మరొకరు విద్యార్థుల అభ్యాసాన్ని పరిశీలించే విధానం అమలు చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో వారు వివిధ పోటీ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా బోధనలో వినియోగించి విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గత ఏడాది కూడా ఇదే తరహా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని గుర్తుచేసిన కలెక్టర్, వాటి ద్వారా నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో ఎంతవరకు అమలు చేస్తున్నామో ప్రతి ఉపాధ్యాయుడు స్వయంగా సమీక్షించుకోవాలని అన్నారు. విద్యార్థులు బట్టీ విధానానికి పరిమితం కాకుండా పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ నేర్చుకునేలా బోధించాలన్నారు. అలా చేస్తే ఎక్కువ కాలం విషయాలను గుర్తుంచుకుని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు.

## గోమాతకు ప్రత్యేక పూజలు చేసిన రాంచందర్‌రావు

### గోశాలతో ప్రత్యేక అనుబంధమన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



**హైదరాబాద్, జూలై 24 (మన దీపం):**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని సువర్ణ భారతి గోశాలను సందర్శించి గోసేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి సేవలు అందించారు. ఈ సందర్భంగా గోశాలతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, గోసేవ చేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గోమాతను ప్రార్థించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆశీర్వాదాలు పొందేందుకు మొదటగా సందర్శించిన ప్రదేశం ఇదేనని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మరోసారి అదే పవిత్ర స్థలానికి వచ్చి గోమాతకు పూజలు సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించేలా తనకు ఆశీర్వాదాలు అందించాలని గోమాతను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. సువర్ణ భారతి గోశాలతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడిందని రాంచందర్‌రావు తెలిపారు. గోశాలలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, గోసేవ ఎంతో పవిత్రమైన కార్యమని అన్నారు. గోవుల సంరక్షణ ద్వారా సమాజంలో సేవాభావం పెంపొందుతుందని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గోమాత పట్ల భక్తి, గౌరవం భారతీయ జీవన విధానంలో విడదీయరాని భాగమని వివరించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని గోమాతను ప్రార్థించినట్లు రాంచందర్‌రావు చెప్పారు. రైతులు, పశుపోషకులు మరింత అభివృద్ధి చెందాలని, వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలు బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సామరస్యం నెలకొని ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. గోశాల నిర్వాహకులతో రాంచందర్‌రావు ముచ్చటించి అక్కడ చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. గోవుల సంరక్షణ, పోషణ, వైద్య సేవలు, నిర్వహణ కోసం చేస్తున్న కృషిని అభినందించారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. గోశాలల అభివృద్ధికి సమాజం నుంచి మరింత సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గోశాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. గోసేవతో పాటు గో సంరక్షణ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. సమాజంలో ఆధ్యాత్మిక విలువలు, సేవాభావం మరింత పెరగాలని ఆకాంక్షిస్తూ, తెలంగాణ ప్రజలందరికీ శాంతి, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని మరోసారి గోమాతను ప్రార్థించారు.

## ఖమ్మం తాగునీటిపై అప్రమత్తంగా ఉండాలి

### ఏన్కూర్ రెగ్యులేటర్ వద్ద జలాల ప్రవాహాన్ని పరిశీలించిన భట్టి



**ఖమ్మం, జూలై 24 (మన దీపం):**

ఖమ్మం జిల్లా ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం ఏన్కూర్ రెగ్యులేటర్ వద్ద సీతారామ ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ ఎడమ కాలువలోకి విడుదలవుతున్న గోదావరి జలాల ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన, అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ఎల్ నినో' ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు నిరంతర తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలకు ముందస్తుగా నీటి సరఫరా ప్రణాళికలు సిద్ధం చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క అన్నారు. జల వనరుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ప్రజలకు నిరంతర తాగునీటి భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా ముందస్తు ప్రణాళికలతో సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. జలాల ప్రవాహ పరిశీలన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. తాగునీటి అవసరాలపై నిరంతర సమీక్ష నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండనీయం: దాస్యం వినయ్ భాస్కర్

### నీట్ వ్యవహారంలో ప్రభుత్వాలపై విమర్శలు



**హనుమకొండ, జూలై 24 (మన దీపం):**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షా పత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఖండించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని జాఫర్ నిజాం హాల్‌లో ఉమ్మడి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు నీట్ పరీక్ష నిర్వహణ, పరీక్షా పత్రం లీకేజీ, విద్యార్థుల సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో మాట్లాడిన దాస్యం వినయ్ భాస్కర్, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు వారిపై బలప్రయోగానికి పాల్పడడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కును కాలరాయడం సరికాదని అన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తుంటే వారితో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపాల్సిందిపోయి లాఠీచార్జ్ చేయడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. నీట్ పరీక్షా పత్రం లీకేజీ వ్యవహారంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణలో లోపాలు చోటుచేసుకోవడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించాలని సూచించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం కారణంగా పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. అలాంటి ఘటనల నేపథ్యంలో విద్యార్థుల కుటుంబాలకు జరిగిన అన్యాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు

### విద్యా సంస్థల యాజమాన్యాలకూ బాధ్యతలు

### ప్రత్యేక చట్టంపై అధ్యయనానికి సీఎం ఆదేశం

### టోల్‌ఫ్రీ, క్యూఆర్ కోడ్ వ్యవస్థపై పరిశీలన





**హైదరాబాద్, జూలై 24 (మన దీపం):**

రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థల ప్రాంగణాల్లో మాదక ద్రవ్యాలకు సంబంధించిన ఏ ఘటన జరిగినా ఆయా యాజమాన్యాలు కూడా బాధ్యత వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీల పనితీరుపై ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించి అమలులో ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు అవసరమైతే ప్రత్యేక చట్టం రూపొందించే అంశాన్ని అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా సంస్థల ప్రాంగణాల వెలుపల జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి వెంటనే సమాచారం అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేలా ప్రతి విద్యా సంస్థలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మాదక ద్రవ్యాల నిరోధంలో విద్యా సంస్థలకు అధికారాలతో పాటు స్పష్టమైన బాధ్యతలను కూడా అప్పగించాలని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా అందించేందుకు ప్రతి విద్యా సంస్థలో టోల్‌ఫ్రీ నంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే స్పందించే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. డ్రగ్స్ కార్యకలాపాలను గుర్తించడం, వినియోగిస్తున్న వారిని వ్యసనం నుంచి బయటపడేయడం, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడం అనే మూడు దశల్లో సమర్థవంతంగా పనిచేయాలని ముఖ్యమంత్రి





# మెగా పీటీఎం.. బంగారు భవితకు బలమైన బంధం

**విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల భాగస్వామ్యం కీలకం**

**ప్రభుత్వ బడులు.. విలువల విద్యకు, విజ్ఞానానికి నెలవులు**

**ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)**

మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం) విద్యార్థుల విద్యా ప్రగతి, సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహనను మరింత బలోపేతం చేసే వేదికగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి పాఠశాల, సమాజం కలిసి పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయనే దార్శనికతకు అనుగుణంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శుక్రవారం జగ్గయ్యపేటలోని గెంటేల వెంకట జోగయ్య జెడ్పీ ఉన్నతపాఠశాలలో జరిగిన మెగా పీటీఎం 4.0లో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్.. ఆర్డీవో జి.అనిల్ కుమార్, డీఈవో ఎల్.చంద్రకళ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు. 723 మంది విద్యార్థులు గల పాఠశాలలో విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి ఆయా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం సైన్స్, మ్యాథమెటిక్స్ ల్యాబ్‌లను పరిశీలించారు. దాదాపు 9,000 పుస్తకాలకు నెలవైన పాఠశాల గ్రంథాలయం, క్రీడా సామగ్రి ప్రదర్శనను పరిశీలించిన అనంతరం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సెల్ఫీస్టాండ్ వద్ద ఫొటోలు దిగి మొక్కలు నాటారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించి టగ్ ఆఫ్ వార్, రంగవల్లుల పోటీలను పరిశీలించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సభా కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మెగా పీటీఎం విజయవంతంగా జరుగుతున్నాయని.. విద్యార్థుల ప్రగతిని 360 డిగ్రీల కోణంలో పరిశీలించి.. లోటుపాట్లు ఏవైనా ఉంటే సరిదిద్ది అత్యుత్తమ విద్యా ఫలితాలు రాబట్టేందుకు ఈ కార్యక్రమాలు దోహదం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు, పథకాల అమలుపై తల్లిదండ్రుల సూచనలు తీసుకునేందుకు ఇవి మంచి వేదికలుగా నిలుస్తున్నాయన్నారు. అదేవిధంగా తమ పిల్లలు చదువుకుంటున్న పాఠశాల వాతావరణాన్ని తల్లిదండ్రులకు పరిచయం చేసేందుకు కూడా ఉపయోగపడతాయన్నారు. విద్యకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకునేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపైనా చర్చించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ప్రయోజనకారిగా ఉంటున్నాయని వివరించారు. ప్రభుత్వ కృషికారణంగా పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు వస్తున్నాయని.. దాదాపు 5 వేల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు రావడం ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాల్సిన విషయమన్నారు. విద్యార్థుల హాజరుతో పాటు మార్కులు తదితర వివరాలను తమ మొబైళ్లలోనే తల్లిదండ్రులు తెలుసుకునేందుకు లీప్ యాప్ డిజిటల్ వేదిక ఉపయోగపడుతోందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

గౌరవ సీఎం, గౌరవ విద్యాశాఖ మంత్రి కృషి ఫలితంగా ప్రభుత్వ బడులు విలువలతో కూడిన విద్యను అందిస్తూ విజ్ఞానాన్ని అందిస్తున్నాయని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. చేస్తూ నేర్చుకునేందుకు వీలుగా పాఠశాలల్లో ల్యాబ్‌లు, వొకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉంటున్నాయన్నారు. భవిష్యత్తులో వారి కాళ్లపై వారు నిలబడేలా పాఠశాలల్లో నైపుణ్యాలు అందుతున్నాయని వివరించారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల సహకారం అత్యంత కీలకమని.. పిల్లల చదువుపై నిరంతర శ్రద్ధ చూపడంతో పాటు పాఠశాల కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. మెగా పీటీఎం.. విద్యార్థుల విద్యా పురోగతి, హాజరు, అభ్యాస ఫలితాలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, లీప్ యాప్ వినియోగం, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పురోగతి, పాఠశాల అభివృద్ధి చర్యలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు విస్తృతంగా చర్చించేందుకు, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు దోహదం చేస్తోందని వివరించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న తల్లికి వందనం వంటి పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకొని కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీవీ నాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎస్.మేరి, తహసీల్దార్ ఎస్.శిరీష, పీసీ ఎక్స్ అఫీషియో మెంబర్ కర్లపాటి శ్రీనివాసరావు, ఎంఈవో చిట్టి బాబు, వార్డు కౌన్సిలర్ గీతా రాణి, అసిస్టెంట్ ఏఎంవో శిరీషా రాణి, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ధోనీ సలహా పనిచేసింది

టీమిండియా వికెట్ కీపర్-బ్యాటర్ సంజూ శాంసన్ తన ఐపీఎల్ కెరీర్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. 11 ఏళ్ల పాటు సుదీర్ఘ అనుబంధం ఉన్న రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం ఒక భారీ రిస్క్ అని, అయితే చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడం వల్ల తనలో కొత్త శక్తి పుట్టుకొచ్చిందని అన్నాడు. జియోస్టార్ 'సూపర్ స్టార్స్' కార్యక్రమంలో మాట్లాడుతూ సంజూ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. రాజస్థాన్ రాయల్స్‌తో తన బంధంపై సంజూ మాట్లాడుతూ.. "రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం చాలా పెద్ద రిస్క్. ఒకసారి ఫ్రాంచైజీకి మీ మనసులో మాట చెప్పాక, వెనక్కి వెళ్లే మార్గం ఉండదు. ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలున్నాయి. మొదటిది, 2025 సీజనే ఆర్ఆర్‌తో నాకు చివరిదని నేను నిశ్చయించుకున్నా. నా కుటుంబం, నా భార్యతో సుదీర్ఘంగా చర్చించాను. ఇది ఆవేశపూరిత నిర్ణయమా? అని వాళ్లు అడిగారు. కానీ రెండు, మూడు వారాల చర్చల తర్వాత.. ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నా. రెండోది, నాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. సున్నా నుంచి మళ్లీ ప్రారంభించడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. చెపాక్ లాంటి నెమ్మదైన వికెట్‌పై నా బ్యాటింగ్ శైలి సరిపోదని చాలామంది అన్నారు. కానీ, 'నీకు 30 ఏళ్లు. ఏదో ఒక మార్గం కనుక్కో' అని నాకు నేను చెప్పుకున్నాను. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఏదో సాధించాలనే పట్టుదలతో, కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగాను" అని వివరించాడు. 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచినప్పటికీ, సీఎస్‌కే తరఫున ఆడిన మొదటి మూడు మ్యాచ్ లలో సంజూ విఫలమయ్యాడు. ఆ సమయంలో జట్టు యాజమాన్యం నుంచి లభించిన మద్దతు, ముఖ్యంగా ఎంఎస్ ధోనీ ఇచ్చిన సలహా తనను ఎలా మార్చిందో సంజూ గుర్తుచేసుకున్నాడు. "టీ20 క్రికెట్‌లో వైఫల్యాలు సహజం. నేను సీఎస్‌కేలో చేరినప్పుడు మొదటి మూడు మ్యాచ్ లలో విఫలమయ్యాను. మేం ఆ మూడు మ్యాచ్ లూ ఓడిపోయాం. ప్రపంచకప్ ఫైనల్ ఆడిన ఫామ్‌ను కొనసాగించలేకపోయాను. అలాంటి స్థితిలో కోచ్, కెప్టెన్, మహీ భాయ్ అందరూ మనవైపే చూస్తారని తెలుసు. అయితే, జట్టు యాజమాన్యం, సహచరుల నుంచి నా పట్ల స్పందనలో ఒక్క శాతం కూడా మార్పు రాలేదు. నాపై వారి నమ్మకం తగ్గలేదు. అది నాకు చాలా బలాన్నిచ్చింది. ప్రాక్టీస్ సెషన్‌లో మహీ భాయ్ నా దగ్గరకు వచ్చి 'బాగున్నావా?' అని అడిగారు. నేను 'ఫైన్ భయ్యా' అన్నాను. కానీ, నా సమాధానంలో 'కానీ, అయితే' లాంటి మాటలు దొర్లాయి.




## శ్రేయస్.. వరుసగా 8 టాస్‌లు విన్!

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టాస్ గెలవడంలో భారత్ నయా సారథి శ్రేయస్ అయ్యర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు! కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ వరుసగా ఎనిమిది సార్లు టాస్ గెలిచిన ప్రపంచంలోనే ఏకైక సారథిగా అరుదైన వరల్డ్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. గతంలో బహామాస్ కెప్టెన్ గ్రెగొరీ టేలర్ (7 సార్లు) పేరిట ఉన్న అంతర్జాతీయ రికార్డును శ్రేయస్ అధిగమించాడు. అంతేకాకుండా, గతంలో టీమ్ ఇండియా కెప్టెన్‌గా ఎంఎస్ ధోనీ (2010-2012 మధ్య వరుసగా 7 టాస్‌లు) నెలకొల్పిన రికార్డును కూడా అయ్యర్ చెరిపివేశాడు. ఈ అరుదైన లక్కీ రికార్డుతో పాటు, సుదీర్ఘకాలంగా వెంటాడుతున్న ఓటముల పరంపరకు తెరదించుతూ కెప్టెన్‌గా తన మొదటి విజయాన్ని కూడా అయ్యర్ ఆస్వాదించాడు. హరారేలో జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్, ప్రత్యర్థిని 125/7 పరుగులకే పరిమితం చేసింది. భారత యువ పేసర్ మయాంక్ యాదవ్ (2/18) నిప్పులు చెరిగే బంతులతో జింబాబ్వే బ్యాటర్లను వణికించి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. అనంతరం 126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ ఊహకందని ధమాకా ఇచ్చాడు. కేవలం 18 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ సాధించి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పేశాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్), ఇషాన్ కిషన్ (35) సమయోచితంగా రాణించడంతో భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే 7 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది.




## మెస్సీ వీడ్కోలుకు ఏర్పాట్లు?

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకడానికి సిద్ధమవుతున్నాడు. 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓటమి పాలైన తర్వాత తన భవిష్యత్తుపై మౌనం వహించిన మెస్సీ, ఇప్పుడు రిటైర్మెంట్ వైపు మొగ్గు చూపుతున్నట్టు అర్జెంటీనా మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ వార్త ఫుట్‌బాల్ ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కథనాల ప్రకారం.. మెస్సీ మరో ప్రపంచకప్‌లో ఆడే ఆలోచనలో లేడు. అయితే, జట్టులో యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేస్తూ, సాఫీగా మార్పులు జరిగేందుకు వీలుగా మరికొన్ని నెలల పాటు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అదే సమయంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏఎఫ్ఏ) మెస్సీకి ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఒక ప్రత్యేక, భారీ వీడ్కోలు మ్యాచ్‌ను నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మ్యాచ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు తమ హీరోకు అద్భుతమైన వీడ్కోలు ఇచ్చే అవకాశం లభిస్తుందని ఓ స్పోర్ట్స్ చానల్ తన కథనంలో పేర్కొంది.



# అల్లు అర్జున్ పొలిటికల్ ఎంట్రీ రూమర్స్‌పై క్లారిటీ!

**ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాజకీయాల్లోకి రానున్నారంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో (సోషల్ మీడియా), సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఆయన మామగారు కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండటంతో ఈ వార్తలకు మరింత ఊతం లభించింది. అయితే ఈ ప్రచారంపై తాజాగా అల్లు అర్జున్ మేనేజర్ శరత్ చంద్ర నాయుడు స్పష్టత ఇచ్చారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన శరత్ చంద్ర నాయుడు, అల్లు అర్జున్ రాజకీయాల్లోకి వస్తున్నారనే వార్తలను పూర్తిగా ఖండించారు. ఇలాంటి ప్రచారం అంతా అసత్య ప్రచారం (ఫేక్ న్యూస్) మాత్రమేనని స్పష్టం చేశారు. "ఈ వార్తలు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వెంటనే నేను వాటికి నేరుగా స్పందించాను.**

హైదరాబాద్, జూలై 24

అవన్నీ అవాస్తవ ప్రచారాలే. ప్రస్తుతం అల్లు అర్జున్ దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉంది. ఆయన భారతదేశంలోనే అత్యంత బిజీగా ఉన్న అగ్ర కథానాయకులలో ఒకరు. ఇలాంటి సమయంలో ఆయన సినిమాలను పక్కన పెట్టి రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఏముంది?" అని శరత్ చంద్ర నాయుడు ప్రశ్నించారు. అలాగే, అల్లు అర్జున్ తన సినీ ప్రయాణంలో (కెరీర్‌లో) అత్యంత కీలకమైన దశలో ఉన్నారని, ఇప్పటికే పలు భారీ బహుభాషా (పాన్ ఇండియా) ప్రాజెక్టులకు అంగీకారం తెలిపారని వివరించారు. రాబోయే దాదాపు పదేళ్ల పాటు ఆయన సమయం (షెడ్యూల్) సినిమాలతోనే నిండిపోయిందని, అలాంటి పరిస్థితిలో రాజకీయాల గురించి ఆలోచించే ఆస్కారమే లేదని వెల్లడించారు. మామగారి ద్వారా అల్లు అర్జున్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తారనే ప్రచారాన్ని కూడా ఆయన కొట్టిపారేశారు. అలాంటి వార్తలకు ఎలాంటి ఆధారాలు లేవని, కేవలం ఊహాగానాలేనని చెప్పారు. ప్రస్తుతం అల్లు అర్జున్ వరుస చిత్రాలతో ఎంతో బిజీగా ఉన్నారని, దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న పలు ప్రాజెక్టులు ఆయన చేతిలో ఉండటంతో పూర్తి దృష్టిని సినిమాలపైనే కేంద్రీకరించారని స్పష్టం చేశారు. దీంతో ఐకాన్ స్టార్ రాజకీయాల్లోకి వస్తున్నారనే ప్రచారానికి తెరపడినట్లయింది.

# ఓటీటీలోకి నాగ బంధం

## ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్!

హైదరాబాద్, జూలై 24

యంగ్ హీరో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో నటించిన ఫాంతసీ పీరియాడిక్ అడ్వెంచర్ చిత్రం 'నాగ బంధం' థియేటర్లలో విడుదలైన కేవలం మూడు వారాలకే ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించిన ఈ విజువల్ గ్రాండియర్‌పై విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొన్నాయి. థియేటర్లలో మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. భారీ నిర్మాణ విలువలు, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్, విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ సరసన నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటించారు. ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో విడుదలకు ముందు సినిమాపై మంచి వాతావరణం ఏర్పడింది. అదే ప్రభావంతో తొలి రోజుల్లో బాక్సాఫీస్ వద్ద ఓపెనింగ్స్ కూడా ఆశాజనకంగా నమోదయ్యాయి. అయితే విడుదల అనంతరం కథ, కథా గమనం (స్క్రీన్‌ప్లే) విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో సినిమాకు మిశ్రమ స్పందన లభించింది.






# పెళ్లిపై రేఖ వేదవ్యాస్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 24

ఒకప్పుడు 'ఆనందం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న నటి రేఖ వేదవ్యాస్ చాలా కాలంగా వెండితెరకు దూరంగా ఉన్నప్పటికీ, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, ప్రేమ, పెళ్లిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాను ఇప్పటికీ పెళ్లి చేసుకోలేదని, సల్మాన్ ఖాన్‌లాగే జీవితాంతం అవివాహితగానే ఉ ండిపోతానేమోనని సరదాగా వ్యాఖ్యానించారు. తాను ఇంకా సింగిల్‌గా ఉన్నానని చెప్పినా చాలామంది నమ్మరని, ఎవరో ఒకరు జీవితంలో ఉంటారనే భావనతో మాట్లాడుతుంటారని అన్నారు. జీవిత భాగస్వామి విషయంలో గతంలో ఎన్నో అంచనాలు ఉండేవని, కానీ ఇప్పుడు అలాంటి జాబితాలు ఏవీ లేవని రేఖ తెలిపారు. పరిపూర్ణమైన వ్యక్తి ఎవరూ ఉండరని, తానూ పరిపూర్ణురాలిని కాదని చెప్పారు. తనను నిజంగా ప్రేమించే, మంచి మనసున్న వ్యక్తి దొరికితే అదే చాలనేది తన అభిప్రాయమని వెల్లడించారు. ఎత్తు, రంగు, రూపం వంటి బాహ్య లక్షణాలకు తాను ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వనని, మంచి హృదయమే జీవితాంతం నిలిచే అందమని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో సరదాగా మాట్లాడుతూ.. నిజంగా పెళ్లి చేసుకోవాలనే ఉ ద్దేశంతో ఉన్నవారు తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా సంప్రదించవచ్చని, అయితే కాలక్షేపం కోసం కాదు, జీవిత భాగస్వామిగా ఆలోచించే వారు మాత్రమే సంప్రదించాలని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి. ప్రేమ, ఆకర్షణ, మోజు మధ్య ఉన్న తేడాను కూడా రేఖ వివరించారు. ఆకర్షణ అంటే ఒకరితో కలిసి జీవితం సాగితే బాగుంటుందనే భావన మాత్రమేనని, కానీ మోజు మాత్రం ప్రమాదకరమని చెప్పారు.

# జన నాయకుడుకు ఓటీటీ వేదిక ఖరారు?

చెన్నై, జులై 24


తమిళ సినీ నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయకుడు' ఇటీవల ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలకు ముందే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి వసూళ్లు నమోదు కాలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ విడుదలకు సంబంధించిన వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దర్శకుడు హెచ్. వినోద్ రూపొందించిన ఈ రాజకీయ యాక్షన్ కథాచిత్రంలో విజయ్ పదవీ విరమణ చేసిన పోలీసు అధికారిగా నటించారు. పూజా హెగ్డే కథానాయికగా నటించగా, బాబీ డియోల్, ప్రకాశ్ రాజ్, ప్రియమణి, మమితా బైజు తదితరులు కీలక పాత్రలు పోషించారు. సినిమాలో విజయ్ నటన, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకున్నప్పటికీ, కథనం నెమ్మదిగా సాగడం వల్ల మిశ్రమ స్పందన లభించింది. దీంతో విడుదల అనంతరం ప్రేక్షకుల దృష్టి ఓటీటీ విడుదలపై పడింది. సినిమా డిజిటల్ హక్కుల కోసం తొలుత ప్రముఖ ఓటీటీ సంస్థతో భారీ మొత్తానికి చర్చలు జరిగినట్లు ప్రచారం జరిగింది.




# '35-చిన్న కథకాదు' స్క్రీన్‌ప్లే పుస్తకం ఆవిష్కరణ!

హైదరాబాద్, జూలై 24

ఇటీవల ప్రకటించిన జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో 2024 సంవత్సరానికి గాను '35–చిన్న కథకాదు' చిత్రం ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికైన విషయం తెలిసిందే. నివేధా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నందకిషోర్ దర్శకత్వం వహించగా, సృజన్ యర్రబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ క్రమంలో గురువారం నాడు ఈ సినిమాకు సంబంధించిన కథా గమన (స్క్రీన్‌ప్లే) పుస్తకాన్ని చిత్రబృందం ఆవిష్కరించింది. 2018లో ఒక చిన్న ఆలోచనతో మొదలైన ఈ సినిమా ప్రయాణం జాతీయ పురస్కారాన్ని గెలుచుకునే వరకు వెళ్లడం ఒక మధుర జ్ఞాపకమని, ఈ గుర్తింపు తమపై మరింత బాధ్యతను పెంచిందని దర్శకుడు నందకిషోర్ తెలిపారు. ఈ స్క్రీన్‌ప్లే పుస్తకం ఎంతో మందికి, ముఖ్యంగా భావి దర్శకులకు ఎంతో ఉపయుక్తంగా ఉ ంటుందని ఆయన పేర్కొన్నారు.



# ఈ నెల 31న కర్మాఖ్య విడుదల

హైదరాబాద్, జూలై 24

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కర్మాఖ్య'. అభినయకృష్ణ దర్శకత్వంలో శ్రీవాణీనాథ్, యశ్వంత్‌రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం నాడు ఈ చిత్రం తాలూకు ప్రచార చిత్రాన్ని (ట్రైలర్) సీనియర్ నటి విజయశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. "తొలుత ఈ సినిమాకు 'కామాఖ్య' అనే పేరు (టైటిల్) పెట్టాం. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల పేరు మార్చాల్సి వచ్చింది. అమ్మవారి అంశాలు కలిగిన నేర పరిశోధనాత్మక (క్రైమ్ థ్రిల్లర్) చిత్రమిది. ఆద్యంతం అనూహ్య మలుపులతో ఉత్కంఠను పంచుతుంది" అని తెలిపారు. ఈ చిత్రాన్ని థియేటర్‌లోనే చూసి అనుభూతి చెందాలని (ఎక్స్‌పీరియన్స్ చేయాలని) నిర్మాత శ్రీవాణీనాథ్ కోరారు. ఆనంద్, శరణ్యప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తుండగా.. కథ, దర్శకత్వ బాధ్యతలను అభినయకృష్ణ నిర్వహించారు.



# హాలీవుడ్ సంస్థతో 'రామాయణ' జోడీ




హైదరాబాద్, జూలై 24

భారతీయ సినీ ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో 'రామాయణ' ఒకటి. దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ భారీ బహుభాషా ప్రాజెక్ట్‌లో రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ సినిమా ప్రచార చిత్రాన్ని (ట్రైలర్) మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించగా, దానికి అద్భుతమైన స్పందన లభించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో ప్రచార చిత్రాన్ని ఎప్పుడు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467